ప్రజాశక్తి
శుక్రవారం 5 జులై 2024 5
శ్రీ సత్యసాయి



టిడిపి నేతల వేధింపులు

ఎండిఎం నిర్వాహకురాలి ఆత్మహత్యాయత్నం

వజ్రకరూరు : 23 ఏళ్లుగా ఎలాంటి ఆరోపణలూ లేకుండా నిర్వహిస్తున్న పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీని వదిలేయాలంటూ ఇటీవల కొందరు టిడిపి నాయకులు బెదిరించడంతో మనస్తాపానికి లోనై మధ్యాహ్న కార్మికురాలు ఆత్మహత్యకు యత్నించింది. పాఠశాల ఆవరణంలోనే పురుగుల మందు తాగింది. ఇందుకు సంబంధించి బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం చాయాపురం గ్రామానికి చెందిన సుంకమ్మ గత 23 ఏళ్లుగా గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా ఉంటూ పిల్లలకు భోజనం అందిస్తోంది. ఇటీవల టిడిపి అధికారంలోకి రావడంతో భోజన ఏజెన్సీని వదిలేయాలంటూ గ్రామానికి చెందిన కొందరు టిడిపి నాయకులు ఆమెను బెదిరించారు. తాను ఎలాంటి వివాదాల్లో లేనని, తన జీవనాధారం దూరం చేయొద్దంటూ ఆమె ప్రాధేయపడింది. అయినా ఏజెన్సీని వదులుకోవాంటూ టిడిపి నాయకులు బెదిరించారు. ఇదే విషయంపై గురువారం ఉదయం పాఠశాల ఆవరణలో వివాదం చెలరేగింది. దీంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ గదిలోనే సుంకమ్మ పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టిడిపి నాయకులపై చర్యలు తీసుకోండి : సిపిఎం

చాయపురం గ్రామంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలని బెదిరింపులకు గురి చేసి, ఆమె ఆత్మహత్యాయత్నంకు కారణం అయిన టిడిపి నేతలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి విరూపాక్షి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సిఐటి డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నంకు పాల్పడి గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. మధ్యాహ్న భోజనం పథకం ఏర్పాటుచేసిన 2003 సంవత్సరం నుంచి ఎలాంటి ఆరోపణలు లేకుండా ఏజెన్సీని నిర్వహిస్తోందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఏజెన్సీ నిర్వహణ బాధ్యతను తమకు ఇవ్వాలంటూ టిడిపి నేతలు బెదిరింపులకు పాల్పడడంతో ఆమె ఆత్మహత్యకు యత్నించిందన్నారు. బెదిరింపులకు పాల్పడిన వారిపై పోలీసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీని ఆమెకే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు జయ రమాదేవి, ఎండిఎం జిల్లా అధ్యక్షులు జయమ్మ, ఉపాధ్యక్షులు రంగమ్మ, కౌలు రైతు సంఘం అధ్యక్షులు రంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యాసంస్థల

బంద్ విజయవంతం



హిందూపురంలో విద్యా సంస్థలను బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజ్‌కు కేంద్ర బిందువు అయిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని, అందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో విజయవంతం అయ్యింది. ఎన్‌టిఎ పనితీరు, నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలన బంద్ చేయించారు. స్వచ్ఛందంగా ప్రయివేటు విద్యా సంస్థలను మూసి వేసి బంద్‌కు సహకరించారు. అనంతపురం జిల్లా



రాయదుర్గంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేస్తునన పోలీసులు

రాయదుర్గంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

వార్త 6లో

అధికారం మాది..మీరు తప్పుకోండి..!

- ◆ స్కీమ్ వర్కర్లపై రాజకీయ ఒత్తిళ్లు
- ◆ కొన్ని చోట్ల అమ్మకానికి పోస్టులు
- ◆ మీరు తప్పుకుంటే.. మావాళ్లకిస్తామంటూ బెదిరింపులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారం మారింది... ఇక మీరు తప్పుకుంటే... మావాళ్లకివ్వాలి అంటూ అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు స్కీమ్ వర్కర్లపై పెరుగుతున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, కొన్ని చోట్ల ఆశా వర్కర్లు, రేషన్ డీలర్లపై ఈ రకమైన ఒత్తిళ్లు అధికమయ్యాయి. పాత వారిని తప్పించి కొత్తవారికి ఈ పోస్టులు కట్టబెట్టేందుకు అధికార టిడిపి నాయకులు క్షేత్ర స్థాయిలో ఈ పథకాల్లో పనిచేస్తున్న పాత వారిపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారన్న ఆరోపణలు. కొన్ని చోట్ల ఖాళీ అయిన పోస్టులకు ధరలు కూడా నిర్ణయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ పథకాల కింద పనిచేస్తున్న సిబ్బంది ఉన్నారు. ఉపాధి పథకం అమల్లో క్షేత్ర స్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్ కీలకం. గ్రామ పంచాయతీకి ఒకరుచొప్పున ఉన్నారు. ఈ రకంగా అనంతపురం జిల్లాలో 500 మందికిపైగా ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ఇందులో కొంత మంది దశబ్దకాలంగానూ పనిచేస్తున్న వారు ఉండగా, కొంతమంది గత ప్రభుత్వ హయంలో పాత వారిని తప్పించి కొత్తగా నియమించుకున్నవి ఉన్నాయి. ఇప్పుడు ఈ రకంగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను రాజీనామాలు చేయాలని ఒత్తిడి పెంచుతున్నారు. ఇక పాఠశాలల్లో మధ్యాహ్నం విద్యార్థులకు ఏర్పాటు చేసేందుకున్న భోజన ఏజెన్సీలపైనా ఈ రకమైన ఒత్తిళ్లే ఉంటున్నాయి. జిల్లాలో సుమారు 1620 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు నడుస్తున్నాయి. ఇప్పుడు వీరిపైనా ఇదే రకమైన ఒత్తిళ్లు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే గురువారం నాడు వజ్రకరువూరు మండలంలోని ఛాయపురం గ్రామంలో ఏజెన్సీ నిర్వాహకురాలు ఒకరు ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశమైంది. ఇకపోతే యానిమేటర్ల పరిస్థితి ఇదే రకంగా ఉంది. జిల్లాలో వెయ్యి మంది వరకు యానిమేటర్లు పనిచేస్తున్నారు. మహిళా సంఘాల నిర్వహణంలో కీలకంగా పనిచేసే వీరిని తప్పిస్తున్నారు. రేషన్ దుకాణాల సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఎన్నికల ఫలితాలొచ్చిన రోజు నుంచిఎవరికి రేషన్ దుకాణాలివ్వాలన్నది అధికార టిడిపిలో చర్చ నడుస్తోంది. ఈ పోస్టుల కోసం ఆ పార్టీ నేతలు ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద పెద్దఎత్తున చేరుకుని అడుగుతున్నారు. ఒక్క పోస్టుకు సగటున ఐదారుగురు వస్తుండటంతో ఈ పంపిణీ ఎలా చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుంకమ్మను పరామర్శిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

కొన్ని చోట్ల ప్రతి దానికీ ఒక రేటు ?

ఇప్పుడున్న పాతవారిని తప్పించి కొత్తవారిని నియమించే విషయంలోనూ కొన్ని చోట్ల ధరలు నిర్ణయించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో దానికి ఒక్కో రకమైన ధర నిర్ణయించడం చర్చనీయాంశం అయింది. అన్నింటిలోకి అధిక ధర పలుకుతున్నది ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కావడం గమనార్హం. ఈ పోస్టు కావాలనుకునే వారు రూ.10 లక్షలకుపైగా ధర నిర్ణయించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక యానిమేటర్లుకు రూ.30 వేలు, రేషన్ దుకాణానికి రూ.50 వేలు ఇలా అనేక పోస్టులకు కొన్ని నియోజకవర్గాల్లో ధరలు నిర్ణయించినట్టు ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల మాత్రం ఎన్నికల్లో పనిచేసిన వారికిచ్చేందుకు సిద్ధపడుతున్నారు. ఈ రకంగా పాతవారిని తప్పించి కొత్తవారికి అవకాశం కల్పించే పేరుతో ఒత్తిళ్లు వస్తుండటం గమనార్హం.



రైతులకు రుణాల రెన్యువల్ కష్టాలు

జామీను పేరుతో బ్యాంకర్ల సతాయింపు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలో రైతులను పంట రుణాల రెన్యూవల్ కష్టాలు వెంటాడుతున్నాయి. మండలం కేంద్రంలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో రుణాల రెన్యూవల్‌కు నిబంధనల సాకుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రెన్యూవల్ చేయాలంటే తప్పనిసరిగా మరో వ్యకి చేత జామీను సంతకం వేయాలనే నిబంధన పెడుతున్నారు. జామీనుదారుని కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. పొలం పుస్తకాన్ని బ్యాంకులో ఉంచి రుణం తీసుకుంటున్నా మళ్లీ జామీను పేరుతో మరోక వ్యక్తి చేత సంతకం ఏమిటంటూ అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జామీను వేస్తే భవిష్యత్తులో ఏమి ఇబ్బందులు ఉంటాయోనని ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో రెన్యూవల్ జరగడం లేదు. ఇప్పటికే చాలా మందికి రెన్యూవల్ సమయం అయిపోయింది. ఈ నిబంధనను సడలించాలంటూ రైతులు కోరుతున్నా బ్యాంకు సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు దీనిపై స్పందించి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జామీను విధానాన్ని రద్దు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ రైతులు కోరుతున్నారు.


జీవో 117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రభుత్వ పాఠశాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న జీవో 117ను రద్దు చేయాలని ఎస్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీయూ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ గురువారం నాడు జగరాజుపల్లి, బీడుపల్లి, పెడపల్లి, నిడిమామిడి, ప్రశాంతి గ్రామ్ తదితర పాఠశాలల్లో పర్యటించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. పదోన్నతలు, బదిలీలను వెంటనే చేపట్టాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపిఎస్‌ను అమలు చేయాలన్నారు. అవసరమున్న చోట ఉపాధ్యాయులకు కేటాయించి సర్దుబాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా కార్యదర్శి సంపత కుమార్, వెంగమనాయుడు, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్లు వెంకట్రావు నాయక్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి తాళం

ప్రజాశక్తి-కదిరి టౌన్



తాళాలు వేసిన సచివాలయ భవనం

అద్దె చెల్లించకపోవడంతో కదిరి పట్టణంలోని గ్రామ వార్డు సచివాలయానికి తాళాలు వేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కదిరి పట్టణం సహమీరియా వీధి సచివాలయంను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి గత ప్రభుత్వంలో 3 నెలలు నుంచి ఇంటి యజమానికి మున్సిపల్ అధికారులు అద్దె చెల్లించలేదు. దీంతో ఇంటి యజమాని చేసేది లేక సచివాలయంకు తాళాలు వేశారు. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయంకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధుల నివారణ

డిఎంహెచ్ఒ మంజువాణి, ఆర్‌డిఒ భాగ్యరేఖ

ప్రజాశక్తి-కొత్తచెరువు

సీజనల్ వ్యాధులు రాకుండా వైద్యులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యాధికారిణి మంజువాణి, పుట్టపర్తి ఆర్‌డిఒ భాగ్యరేఖ తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కొత్తచెరువు మండల అతిసార రోగులను గురువారం వారు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలపై ఆరా తీశారు. వర్షాకాలంలో అతిసార, టైఫాయిడ్, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటి పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, రోగులకు చికిత్స అందించాలన్నారు. కొత్తచెరువులోని కమ్మపాలెంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. మండల వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి సిహెచ్‌సి స్థాయికి పెరిగినందున రోగులు అధికంగా వస్తున్నారని, కావున మండలంలో మరొక పిహెచ్‌సి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు అశ్వత్థనారాయణ, భార్గవ్, జాన్‌వెస్లీ, సునీల్, తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో, డిఎంఅండ్‌హెచ్ఒ

ప్రజలకు రుణపడి ఉంటా

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచి నేటితో నెల రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా డిక్లరేషన్ ఫారం తీసుకున్న ఆ మధుర క్షణాలను ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారు. తన విజయం వెనుక ఎందరో కృషి, కష్టం, త్యాగం ఉన్నాయని, ఈ విజయం ఎమ్మెల్యేగా నాపై మరింత బాధ్యత పెంచిందని తెలిపారు. పల్లె కుటుంబం మీద నమ్మకంతో మరోసారి మా కుటుంబానికి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబుకి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఐదేళ్లు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో భాగస్వామినవుతానని, వారి కుటుంబ సభ్యురాలిగా అండగా ఉంటానని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి సలహాలు, సూచనలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపి, రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి: మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

బిసి సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. మంత్రి గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో జిల్లా బిసి హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే తక్షణం వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అధికారి నిర్మల జ్యోతి, ఎబిసిడబ్ల్యులు అధికారులు రాజు, కుళ్లాయప్ప, బాలాజీ, సుబ్బరాయుడు, గంగాధర్, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి కం(పు)పోస్ట్ యార్డు..!

- ◆ కార్పొరేషన్ అధికారుల సమావేశంలో వాడీవేడి చర్చ
- ◆ ఎమ్మెల్యే ఎదుట మేయర్, డిప్యూటీ మేయర్ వాదనలు
- ◆ అక్రమాలు జరిగాయి : డిప్యూటీ మేయర్
- ◆ నిబంధనల మేరకే ప్రక్రియ : మేయర్

పజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ కంపోస్ట్ యార్డులో అవినీతి జరిగిదంటూ కౌన్సిల్ సమావేశంలో వాదోపవాదాలు జరిగాయి. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సమక్షంలోనే మేయర్, డిప్యూటీ మేయర్ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. వైసిపికి చెందిన ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో ఆ పార్టీలో అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. గురువారం ఉదయం కార్పొరేషన్ కారాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని గుత్తి రోడ్డులో ఉన్న కంపోస్టు యార్డులో బయో మైనింగ్‌పై వాడీవేడి చర్చ జరిగింది. ఈ కాంట్రాక్ట్ చేజిక్కించుకున్న నోవాసిటీ పనులు పూర్తి చేయకుండానే అర్థాంతరంగా వెళ్లిపోయిందని, ఇందులో భారీగా అవినీతి జరిగిదంటూ పాలకవర్గంకు చెందిన డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇదే సమయంలో మేయర్ మహమ్మద్ వసీం అడ్డుకుని తన వాదనను విన్పించారు. కంపోస్ట్‌యార్డ్‌లో బయో మైనింగ్ జరపటానికి నిర్వహించిన టెండర్లలో రూ.26 కోట్లకు గాను లెస్ రేట్లతో రూ.23 కోట్లకు నోవాసిటీ దక్కించుకుందన్నారు. ఇప్పటివరకు రూ.9 కోట్ల బిల్లులు మాత్రమే ఇచ్చామన్నారు. రూ.2 కోట్ల బిల్లులు ప్రాసెసింగ్‌లో ఉన్నాయన్నారు. బయో మైనింగ్ ప్రాసెస్‌లో అవినీతి జరిగిందంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని మేయర్ చెప్పుకొచ్చారు. డిప్యూటీ మేయర్ స్పందిస్తూ రోజుకు 1000 టన్నుల మెట్రిక్ టన్నుల చెత్తాచెదారాలను నిర్మూలన ప్రకారం ఏడాది కాలంలో 3.26 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ చేస్తామని అగ్రిమెంట్‌లో ఉండగా ఆ కంపెనీ అలా చేయలేదన్నారు. 180 రోజుల కాలానికి కేవలం 77 రోజులు మాత్రమే పని చేశారన్నారు. లక్షన్నర మెట్రిక్ టన్నుల వ్యర్థాలను వదిలేసి, అర్థాంతరంగా పనులు వదిలిపెట్టి వెళ్లారన్నారు. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందన్నారు. ఈ అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ వాదనలను విన్న ఎమ్మెల్యే బయోమైనింగ్‌లో అక్రమాలపై కమిటీ వేయాలని కలెక్టర్‌ను కోరుతామని తెలియజేశారు. కంపోస్ట్ యార్డులో అవినీతి జరిగిందన్న అంశంపై బయట కూడా విమర్శలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో దానిపై విచారణ జరిపించాల్సి ఉందని ఎమ్మెల్యే అభిప్రాయ పడ్డారు.



అల్లూరి సీతారామరాజుకు నివాళి అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్

పోరాట వీరుడు అల్లూరి సీతారామరాజు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్వాతంత్ర సమరానికి ప్రజలను సమాయత్తం చేసి ఆంగ్లేయులతో వీరోచిత పోరు సాగించిన పోరాట వీరుడు అల్లూరి సీతారామరాజు అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కొండయ్య, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య మహాసంగ్రామంలో మహోజ్వల శక్తిగా సీతారామరాజు వెలుగొందారని తెలిపారు. గిరిజన ప్రజలను ప్రజలను పోరాటానికి సమాయత్తం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆ రోజుల్లో ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగాతలకు దోపిడీలకు అన్యాయాలకు గురయ్యేవారన్నారు. వారి శ్రమ దోపిడీ, ఆస్తుల దోపిడీ, స్త్రీల మానపహరణం జరుగుతుండేవని, ఇవన్నీ గమనించిన సీతారామరాజు మన్యం వాసుల కష్టాల నుంచి విముక్తి కలిగించడానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటం చేశారన్నారు. గిరిజనుల అభ్యున్నతికి పాటుపడిన అల్లూరి సీతారామరాజు 27 ఏళ్ల వయసులోనే అమరడయ్యారన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఆయన తెగువ ఎప్పటికీ మరువలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి, డీఈవో మీనాక్షి, ఏడీ రామకృష్ణ, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, నైపుణ్య అభివద్ధి శాఖ అధికారి అబ్దుల్ ఖయ్యూం, క్రీడల శాఖ అధికారి ఉదయభాస్కర్‌తో పాటు బంజార కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

పుట్టపర్తి రూరల్: ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమంలో ఎస్పీ మాధవ్ రెడ్డి అల్లూరి చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర పోరాటంలో అల్లూరి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ జెడ్.విజయ్ కుమార్, ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సైబర్ సెల్ సిఐ హేమంత్ కుమార్, ఆర్‌ఐలు, చంద్రశేఖర్, వలి, రవికుమార్ పాల్గొన్నారు.

చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గురువారం నాడు పోలీసుల కొత్త చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వాహనాల తనిఖీలు చేపట్టారు. మహిళ పోలీసులు మహిళలకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. హైవేలు ముఖ్యమైన కూడళ్లలో వాహనాలు తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు.

కస్తూరిబా పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలో కస్తూరిబా బాలికల పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బందిపై ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ ఆగ్రహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో గురువారం నంబులపూలకుంట కస్తూరిబా పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో బాలికలకు రోజువారీగా వడ్డించే భోజనం మెనూపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ రిహానా విధులకు పట్ల సక్రమంగా హాజరు కాకపోవడంతో ఆర్డీవో ఆమెపై ఆగ్రహించారు. ఈ విషయంపై తమ కార్యాలయానికి వచ్చి సమాధానం ఇవ్వాలన్నారు. మెనూ, విద్య మెరుగుపడకపోవడంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ నరేంద్ర కుమార్, ఎంఈవో గోపాల్ నాయక్, డాక్టర్ ఆనంద్ వర్ధన్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలు మూయించిన నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విద్యాసంస్థల బంద్‌లో భాగంగా పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, గోరంట్ల మండలాల్లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలను మూయించారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు హర్షవర్ధన్, అరుణ్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు హరి మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ల లీకేజీ, నీట్ పిజి పరీక్ష వాయిదా, యుజిసి నెట్ పరీక్ష రద్దు, తదితర అంశాలు విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించాయన్నారు. జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ)ని రద్దు చేయడంతో పాటు నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య పరిస్థితి అలా ఉంటే పాఠశాల విద్యా వ్యవస్థను దారుణంగా తయారు చేశారన్నారు. బిజెపి పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధించారని, ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించేశారన్నారు. 2018-19, 2021-22 మధ్య దేశంలో 61,885 పాఠశాలలు మూసి వేసి పేద విద్యార్థులకు విద్యను దూరం చేశారన్నారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా ఐక్య విద్యార్థి సంఘాలు కెజి నుంచి పిజి వరకూ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం ఇవ్వాలని, పిహెచ్‌డి అడ్మిషన్లకు సంబంధించి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, విద్యార్థి సంఘం నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో ప్రజాస్వామ్యం అణిచివేత చర్యలు ఆపాలని, పాఠశాలల మూసివేతను ఆపాని, నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.



కొత్తచెరులో ర్యాలీ చేపట్టిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా గురువారం శ్రీసత్యసాయిజిల్లాలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. పలుచోట్ల ప్రయివేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. జిల్లా కేంద్రమైన పుట్టపర్తితో పాటు హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం, మడకశిర, తదితర పట్టణాలు, మండలాల్లో ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, తదితర విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు వెళ్లి బంద్‌కు సహకరించాలని కోరారు. వారు కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ)ని రద్దు, నీట్, నెట్ స్కాంలపై సమగ్ర దర్యాప్తు చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి హయాంలో విద్యావ్యవస్థ దారుణంగా తయారైందని మండిపడ్డారు.



కదిరిలో పాఠశాలను బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం : నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజ్‌లకు కేంద్ర బిందువైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని, అందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఎన్‌ఐఎ పనితీరు, నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ పట్టణంతో పాటు రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో విద్యాసంస్థలు బంద్ పాటించాయి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందుగానే విద్యాసంస్థలు బంద్ పాటించాయి. తెరిచిన ప్రభుత్వ హైస్కూళ్ళ, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలను విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులకు సమస్యను వివరించి బంద్ చేయించారు. ఆందోళనలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబా వలి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, నరసింహమూర్తి, తరుణ్, పవన్, జయచంద్ర, జస్వంత్, నిహాల్, లిఖిత్, హుస్సేన్, షాహిద్, శివ, దేవరాజు, పెద్దఎత్తున విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని పాఠశాలలను విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు. నాయకులు మాట్లాడుతూ నీట్, నెట్‌లో జరిగిన అక్రమాలకు కేంద్ర విద్యా శాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను, ఎన్‌టిఎను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్‌జాన్ డిమాండ్ చేశారు. నీట్ స్కాంలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్ కదిరి పట్టణంలో విజయవంతమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్‌జాన్, విజయ్, ఎఐఎస్‌ఎఫ్ నియోజవర్గ అధ్యక్షులు గణేష్, ఎఐఎస్ఎ జిల్లా అధ్యక్షుడు నరసింహా, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా నాయకుడు గాలివీడు ఉపేంద్ర తెలిపారు. నీట్ పరీక్ష రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గౌతమ్, కుమార్, దినేష్, రామంజి, అరుణ్, గణేష్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు, విజయ్, సాయి, గణేష్ ఏఐ ఎస్ఎ నాయకులు ప్రదీప్, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన వారిని కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నీట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వద్దకు వెళ్లి బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరగా విద్యార్థులు తరగతులను బహిష్కరించి మద్దతు పలికారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : నీట్ రద్దు, ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ఆపాలి, తదితర డిమాండ్లతో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్మవరం పట్టణంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల నాయకులు మంజుల నరేంద్ర, పోతలయ్య, నిరంజన్‌యాదవ్, తదితరులు పాఠశాలలు, కళాశాలల వద్దకు వెళ్లి పిల్లలను బయటకు పంపి బంద్ చేయించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి దేశంలో విద్యావ్యవస్థ పూర్తిగా నాశనమైందన్నారు. కార్యకమంలో నాయకులు శివ, గణేశ్, నందకిశోర్, తదితరులు పాల్గొన్నారు.




పుట్టపర్తిలో పాఠశాలను బంద్ చేయిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కొత్తచెరువులోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలను విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు. వారు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పెంచి విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హర్షవర్ధన్, అరుణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

చిలమత్తూరు : మండలంలో ప్రయివేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. చిలమత్తూరు, గాడ్రాళ్లపల్లి, సోమగట్ట, కొడికొండ ప్రభుత్వ హైస్కూళ్లను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జగదీష్ బంద్ చేయించారు. జగదీష్ మాట్లాడూతూ నీట్ స్కాంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయి, మనోజ్, విఘ్నేష్ పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు బంద్ పాటించాయి. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బాబ్‌జాన్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగాన్ని చిన్నాభిన్నం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే నీట్, ఎన్‌టిఎని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


పెనుకొండలో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

టూ టౌన్ సిఐపై కేసు నమోదు

హిందూపురం : పట్టణానికి చెందిన షేక్ ఇస్తాద్‌బాను ఫిర్యాదు మేరకు టూ టౌన్ సిఐ రియాజ్ అహ్మద్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు వన్ టౌన సిఐ శ్రీనివాసులు తెలిపారు. సిఐ రియాజ్ అహ్మద్ తనను పెళ్లి చేసుకునే సమయంలో తాను మొదటి భార్యకు విడాకులు ఇచ్చానని చెప్పి ఆమెకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్నారని పేర్కొంది. తనను శారీరకంగా హింసిస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

పేకాటజూదరులు అరెస్ట్

లేపాక్షి : మండలంలోని తిలక్ నగర్ గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 1,200 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో పేకాట, మట్కా కార్యకలాపాలు నిర్వహిస్తుంటే ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచి స్థావరాలపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకొంటామని తెలిపారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం : స్థానిక సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి ఈ నెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మక్బూల్‌హుస్సేన్ తెలిపారు. విద్యార్థులకు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌తో పాటు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వంటి సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 96188 53847, 92999 97675, 97011 91552 నెంబర్లలో సంప్రదించా లని తెలిపారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి

ముదిగుబ్బ : మండలంలోని రామస్వామితండాలో రహదారిపై గుంతలు ఏర్పడి నీరు నిల్వ ఉండడంతో గ్రామస్తులు తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నారని టిడిపి హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ హేమలతబాయ్ పేర్కొన్నారు. కావున అధికారులు చొరవ చూపి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ గురువారం ఆమె ఎండిఓ కార్యాలయంలో ఈఓఆర్‌డి డి.రాజేంద్ర కృష్ణకుమార్ కు వినతి పత్రం అందజేశారు.

యుపిఐ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించొద్దు

లేపాక్షి : రిజర్వు బ్యాంకు ఆదేశాల మేరకు ఇకపై యుపిఐ పేమెంట్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించకూ డదని ఎఈ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. యుపిఐ యాప్స్ అయిన పేటియం, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కాకుండా ఎపిఎస్‌పిడిసిఎల్ కన్స్యూమర్ యాప్ ద్వారా చెల్లించాలని తెలి పారు.

మంత్రి సవితను కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పెనుకొండ టౌన్ : బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితను గురువారం పట్టణంలోని ఆమె నివాసంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి ఎమ్మెల్యే పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు పలు అంశాలపై కాసేపు ముచ్చటించారు. ఎమ్మెల్యే శ్రావణి మాట్లాడుతూ టిడిపిలో మహిళలకు సముచిత స్థానం దక్కుతుందని, సవితకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా ఇది మరోసారి రుజువైందన్నారు. సవిత రాజకీయాల్లో ఎంతో కష్టపడి పైకొచ్చారని ఆమెకు సముచితమైన స్థానం దక్కిందన్నారు. బిసిలకు, చేనేతలకు న్యాయం చేసేలా పని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.


మంత్రి సవితతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పకడ్బందీగా 'బిసిజి వ్యాక్సినేషన్'

లేపాక్షి : స్థానిక పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో గురువారం వైద్యులు చిరంజీవి ఆధ్వర్యంలో బిసిజి వాక్సినేషన్ కార్యక్రమం చేపట్టగా వాక్సినేషన్ రాష్ట్ర పరిశీలకులు శశికిరణ్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ బిసిజి వాక్సిన్ ఇవ్వాలన్నారు. కేవలం కాగితాల్లో కాకుండా క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ జాగ్రత్తగా వేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అవకతవక లు జరగకుండా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రసాద్, సుబ్రహ్మణ్యం, సౌభాగ్యమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో సూర్యవతి వర్ధంతి

పెనుకొండ టౌన్ : రాష్ట్రంలో ఐద్వా మహిళా సంఘం ఏర్పాటులో మానికొండ సూర్యవతి కీలక పాత్ర పోషించారని ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షులు దిల్షాద్ పేర్కొన్నారు. మానికొండ సూర్యవతి వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్ ప్రాంగణంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు, సాగుభూమి పోరాట కమిటీ మహిళా నాయకురాళ్లతో కలిసి సూర్యవతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్టడీ క్యాంపులో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమి అధ్యక్షతన సూర్యవతి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. దిల్షాద్ మాట్లాడుతూ సూర్యవతి చిన్నతనంలోనే లింగ వివక్ష వ్యతిరేకంగా, గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల ఏర్పాటు, కూలి రేట్ల పెంపు, సమానత్వం, మద్యపాన నిషేధం, తదితర అంశాలపై నినదించారని గుర్తు చేశారు. మహిళలను సంఘటితం చేసి ఉద్యమం వైపు మళ్లించి పెద్దఎత్తున పోరాడారన్నారు. గ్రామపంచాయతీ సర్పంచిగా, ఎంపీపీగా, ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రజలకు సేవలందించారని ప్రశంసించారు. మద్యపాన నిషేధం, డ్వాక్రా మహిళల సమస్యల పరిష్కారం, ఇళ్ల స్థలాల పోరాటాలను బలోపేతం చేస్తూ పోరాడటమే ఆమెకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో స్వర్ణలత, వర్షిని, నాగమణి, నిర్మల, 50 మంది మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నారాయణ చేపట్టారు.


మానికొండ సూర్యవతి వర్ధంతి సభలో మాట్లాడుతున్న దిల్షాద్

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా
ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ


పెనుకొండలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్

మన్యం వీరుడు 'అల్లూరి'కి ఘననివాళి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యంవీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతి సందర్భంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారిణి అంజలిసౌభాగ్యవతి మాట్లాడుతూ అల్లూరి స్వాతంత్ర్య పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. దేశప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, రమణ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

బిజెపి నాయకుల ఆధ్వర్యంలో..

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మరవరాదని బిజెపి చేనేత సెల్ రాష్ట్ర సభ్యులు గుండా పుల్లయ్య పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వారు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుల్లయ్య మాట్లాడుతూ అల్లూరి సాగించిన స్వాతంత్ర్య పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు జల్లా కార్తీక్, పుట్లూరు నరసింహులు, ప్రసాద్, లింగం పరమేశ్, నారాయణస్వామి, పురంధరదాసు పాల్గొన్నారు.

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మిట్ట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు వెంకటేశులు, రవికుమార్, రొద్దం బాబు, హనుమంతు, రామాంజి, చల్లపల్లి ఈశ్వర్, నరసింహులు, కంబాలప్ప, తదితరులు పాల్గొ న్నారు. పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్రశాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ జయప్ప, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ ప్రతాప్ అల్లూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు రామన్న, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ యశోద రాణి, బోటనీ లెక్చరర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని, ఆయన నేటి తరం యువతకు ఆదర్శప్రాయుడని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బుల్‌బాషా తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఓబులేసు, శ్రీనివాసులు, రాజా, మహమ్మద్, దస్తగిరి, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు నేటి యువతకు ఆదర్శం కావాలని గ్రంథాలయ శాఖ అధికారి మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

అవగాహనతో డయేరియా దూరం : సిహెచ్ఒ

ఓబుళదేవరచెరువు : ముందస్తు అవగాహనతో మెలిగితే ప్రాణాంతకమైన డయేరియా బారిన పడకుండా ఉండవచ్చని సిహెచ్ఒ సుభాషిణి సూచించారు. ఆమె గురువారం మండలంలోని గౌనిపల్లి గ్రామంలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ జులై 1 నుంచి 31వ తేదీ వరకూ డెంగీ మాసోత్సవాలు నిర్వహించాలన్నారు. ఐదేళ్ల పిల్లలు డయేరియాకు ఎక్కువగా గురవుతున్నారని, కావున జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే వ్యాధి లక్షణాలు, జాగ్రత్త చర్యలను వివరించారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లాలన్నారు. పాఠశాలలకు వెళ్లి డయేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమెతో పాటు ఒడిసి వైద్యశాల ఎంఎల్ హెచ్‌పి వసుంధర, అంగన్వాడీ టీచర్ షమీం, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శికి ఆర్‌పిల వినతి

హిందూపురం : ఎన్నో ఏళ్లుగా పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రచౌదరిని ఆర్‌పిలు కోరారు. ఈ మేరకు గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆర్‌పిలు పట్టణంలోని ఎమ్మెల్యే బాలయ్య నివా సంలో వ్యక్తిగత కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గౌరవ వేతనం నెల నెలా సక్రమంగా అందడం లేదని, ప్రతి నెలా బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన సురేంద్ర చౌదరి ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ ద్వారా సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ డిఇ.రమేష్‌కుమార్, ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, ఆర్‌పిల యూనియన్ అధ్యక్షురాలు నాగలక్ష్మి, కార్యదర్శి ఆసియాబాను, రాధిక, నాగమణి, రామాంజనమ్మ, హసీనా, స్వప్న, రమణమ్మ, ఆయిషా, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు చేపట్టాలి : జనసేన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు, వెస్ట్ గేట్ రోడ్డు, కమ్మవారిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. గుంతలమయమైన ఆయా రోడ్లను గురువారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ సత్యసాయి దర్శనార్థం వచ్చే విఐపిలకు ఔటర్ రింగ్ రోడ్డు అనుకూలంగా ఉండేన్నారు. పెద్ద కమ్మవారిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి నెల రింగ్ రోడ్డు వయా కమ్మవారిపల్లి మీదుగా పుట్టపర్తి వరకూ సత్యసాయి గిరి ప్రదర్శన జరుగుతుందన్నారు. ఆ సమయంలో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్పందించి మరమ్మతులతో పాటు అవసరమైన చోట కొత్త రహదారి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షులు మారుతి, ప్రధాన కార్యదర్శి రాము, నాయకులు రమేష్‌బాబు, పవన్, నవీన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.


గుంతలమయమైన రహదారిని చూపుతున్న నాయకులు

నిడిమామిడిలో జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమం


ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అతిసార, అడల్ట్ బిసిజి, సీజనల్ వ్యాధులపై గురువారం పుట్టపర్తి పిహెచ్‌సిలోని నిడిమామిడి గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమం నిర్వహిం చారు. ఇందులో ఫ్లోరోసిస్ బాధితులకు రీహాబిలిటేషన్(పునరావాసం) ఎయిడ్స్(పరికరాలు) పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాలను గుర్తించి సర్వే నిర్వహించారు. పాఠశాలలు, ఇంటింటికీ సర్వే నిర్వహించారు. అనుమానాస్పద కేసులను గుర్తించి మూత్ర, రక్త నమూనాలు సేకరించి జిల్లా కేంద్రానికి పంపించి బాధితులను నిర్ధారించి నడుము, మెడకు బెల్టులు, వాకర్లు అందించారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స కూడా చేయిస్తామని తెలిపారు. తాగునీటిలో ఫ్లోరైడ్ శాతాన్ని పరీక్షించి ఉచిత తాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అతిసార నియంత్రణపై ప్రజలు, పిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. అతిసార లక్షణాలు, చికిత్సపై వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, ఆరోగ్య కార్యకర్తలు శివ, మంజులవాణి, ఆశా కార్యకర్తలు నిర్మల, మెహతాజ్, హసీన, పార్వతమ్మ, 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

రక్తహీనతతో బాధపడుతున్న వసంత, కిష్టప్ప, వందనలకు ఎ-పాజిటివ్, ఎబి-పాజిటివ్, బి-పాజిటివ్ రక్తం అత్యసరం కావడంతో పట్టణానికి చెందిన యువకులు గురువారం అఖిల భారత చిరంజీవి యువత పట్టణ అధ్యక్షులు లక్ష్మణ కుటాల ఆధ్వర్యంలో రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. లక్ష్మణ మాట్లాడుతూ మెగాస్టార్, పద్మవిభూషణ్ చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్, బ్లడ్, ఐ బ్యాంక్ స్థాపించి తన అభిమానులను సమాజ సేవకులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన స్ఫూర్తితో సురేష్‌రెడ్డి, వందేమాతరం టీమ్ సభ్యులు బక్కసం నవీన్, తరుణ్ రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో గణేష్, హరీష్, కార్తీక్, అరవింద్, సాయికుమార్, షాబాజ్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న దాతలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ సూచించారు. వైద్య సిబ్బంది గురువారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి డయేరియా, అతిసార వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, టైఫాయిడ్, తదితర జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. కావున దోమలు ఉత్పత్తి కాకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నమూనాలను సేకరించి పరీక్షిస్తామని తెలిపారు. జ్వరం, అతిసార లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మునిచంద్రిక, సామాజిక ఆరోగ్య కార్యకర్త నగేష్, మున్సిపాలిటీ ఏఈ స్వాతి, అశోక్, రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

మడకశిర : పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో గురువారం ఉదయం రెండో వార్డు కౌన్సిలర్ సుధాకర్‌నాయక్ వైసిపికి రాజీనామా చేసి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలో చేరారు. సుధాకర్‌నాయక్‌కు గుండమల తిప్పేస్వామి టిడిపి కండువా వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మనోహర్, కౌన్సిలర్లు నరసింహరాజు, వైస్ ఛైర్మన్ వెంకటలక్ష్మమ్మ, హనుమంతు, ఉమాశంకర్, శ్రీనివాసులు, శీనప్ప, మేఘన, రమేష్, మాజీ కౌన్సిలర్ కృష్ణానాయక్, అంజమ్మ, మాజీ వైస్ ఛైర్మన్ నాగరాజు, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, బేగార్లపల్లి రవి పాల్గొన్నారు.

19 నుంచి గురుపూజ, సంగీత మహోత్సవాలు

హిందూపురం : కర్నాటకలో వెలసిన సద్గురు శ్రీయోగి నారాయణ కైవారం తాతయ్య మఠంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరిగే గురుపూజ, సంగీత మహోత్సవాలను జయప్రదం చేయాలని శ్రీయోగి నారాయణ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ రవిశంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని కెవిఆర్ ఫంక్షన్ హాల్‌లో సద్గురు శ్రీయోగి నారాయణ మహోత్సవాల కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు రాజ్యలక్ష్మి మోహన్‌కుమార్, పార్థసారధి, ఆకుల ఉమేష్, నిమ్మకాయల రామంజి, నవీన్‌కుమార్, శేషాద్రిగౌడ్, అరుణ్‌కుమార్, చంద్రశేఖర్, ఇక్బాల్, మంజు, నాగరాజు, వెంకటేష్, హనుమంతప్ప, ఆర్టీసీ జగదీష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.